పట్టణంలో ఆక్రమణలు తొలగింపు

విశాలాంధ్ర - విజయనగరం : స్థానిక రైల్వే స్టేషన్ ప్రాంతంలో కాలువల ఆక్రమణలను నగరపాలక సంస్థ ప్రణాళిక విభాగం సిబ్బంది తొలగించి వేసారు. విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాలతో మంగళవారం రైల్వే స్టేషన్ ప్రాంతంలో రహదారికి ఇరువైపులా ఉన్న ఆక్రమణలు తొలగించి వేసారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ రైల్వే స్టేషన్ లో ప్రధాన కాలువ మరమ్మత్తు పనులు దాదాపుగా పూర్తికావచ్చాయన్నారు. అయితే రహదారులను ఆక్రమించి కాలువలపై నిర్మాణాలు చేపట్టడం ఇబ్బందిగా మారుతుందన్నారు. దీంతో పూర్తిగా కాలువలపై ఉన్న నిర్మాణాలను తొలగించి వేసామన్నారు. అలాగే ఫలకలను తొలగించి, కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాలను తొలగించి వేస్తున్నామన్నారు. ప్రజలు కూడా సహకరించి కాలువలపై నిర్మాణాలు చేపట్టారాదని సూచించారు.

28వ రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయండి : జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ

విశాలాంధ్ర - రామభద్రపురం : సిపిఐ పార్టీ ఆవిర్భవించి వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా 28వ రాష్ట్ర మహాసభలు ఒంగోలులో జరగనున్నాయని ఈ సభలలో కామ్రేడ్స్ అందరూ పాల్గొని జయప్రదం చేయాలని జిల్లా సిపిఐ కార్యదర్శి ఓ మ్మి రమణఅన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం మహాసభల సంబంధించిన గోడపత్రికలను గోడ పత్రికలను సహాయ కార్యదర్శి ఆనందరావుతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. సిపిఐ పార్టీ నిరంతరం పేదల పక్షాన ఉండి పేద ప్రజల సమస్యల కొరకు పోరాటాలు చేస్తూనే ఉందని అన్నారు. పార్టీ కొరకు ఎంతో మంది మహానుభావులు త్యాగాలు చేసి అసువులు బాసారని గుర్తు చేశారు. కామ్రేడ్స్ పై ఎన్ని కేసులు పెట్టినప్పటికీ అదరకుండా బెదరకుండా గట్టిగా నిలబడి పోరాటం చేస్తున్న పార్టీ ఒక సిపిఐ అని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పరిపాలన చాలా అధ్వానంగా ఉందని, పేద ప్రజలకు చేసింది ఏమీ లేదని ఆరోపించారు. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కాశి పేద ప్రజల రక్తాన్ని పిండించి ఆదని అంబానీలకు దోచిపెడుతుందని అన్నారు. రాష్ట్రంలో కూడా కూటమి ప్రభుత్వం తీరు అదే విధంగా ఉందని అన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీల్లో కూటమి ప్రభుత్వం అమలు చేయడంలో చాలా ఘోరంగా విఫలం చెందిందని అన్నారు. కొందరికి పథకాలు అందుతున్నాయని నిజమైన అర్హులకు పథకాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ఈనెల 20 నుంచి25 వరకు ఒంగోలులో మహాసభలు జరుగుతాయని ఈ మహాసభలకు రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ జాతీయ కార్యదర్శి నారాయణ మాజీ పార్లమెంట్ సభ్యులు అఖిలపక్షం ప్రధాన కార్యదర్శి డి రాజ హాజరవుతారని అన్నారు. అలాగే 23న జిల్లాలో ఉన్న ప్రతి ఒక్క కామ్రేడ్ ఒంగోలు తరలి. రావాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో జిల్లా సిపిఐ కార్యవర్గ సభ్యులు బి రవనమ్మ కోటప్పన్న, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బేబీనాయన ఆద్వర్యంలో ఘనంగా తిరంగా జెండా ర్యాలీ

విశాలాంధ్ర - బొబ్బిలి : భారతీయ మువ్వన్నెల జెండా గొప్పతనం అందరికీ తెలిసేలా కేంద్ర ప్రభుత్వం 'హర్ ఘర్ తిరంగా ప్రచార కార్యక్రమాన్ని చేపట్టింది. జాతీయ జెండా స్ఫూర్తిని క్షేత్రస్థాయికి తీసుకెళ్లడంలో ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చింది. కులం, మతం, ప్రాంతాలకు అతీతంగా భారతీయులంతా ఒక్కటే అనే భావనను ముందుకు తీసుకెళ్లాలని సూచించింది. బిజెపి జిల్లా కార్యదర్శి ముగడ అనిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తిరంగా ర్యాలీ పట్టణంలో అంబేద్కర్ విగ్రహం వద్ద, ఎమ్మెల్యే ఆర్.వీ.ఎస్.కే.కే. రంగారావు (బేబీ నాయన)ప్రారంభించి ర్యాలీలో పాల్గొన్నారు.. ఎమ్మెల్యే బేబీ నాయన తో కలిసి కాలేజీ విద్యార్థినీ విద్యార్థులు, మహిళలు, పలు రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు ఈ ర్యాలీలో పెద్దయెత్తున పాల్గొని, అంబేద్కర్ విగ్రహం నుంచి వందేమాతరం అంటూ నినాదాలతో దక్షిణ దేవిడీ జంక్షన్ వరకు భారీగా ర్యాలీ నిర్వహించారు.

త్రాగునీటి బోరు బావులపై దుష్ప్రచారం తగదు

ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు (సతీష్)

విశాలాంధ్ర - వేపాడ : ప్రజల తాగునీటి అవసరాల కొరకు మండల పరిషత్ నిధులతో తీసిన బోరుబావులపై అవినీతి బురద జల్లి దుష్ప్రచారం చేయడం తగదంటూ మండల పరిషత్ అధ్యక్షుడు దొగ్గ సత్యవంతుడు అన్నారు.మండల పరిషత్ కార్యాలయంలో తన చాంబర్లో మంగళవారం కలిసిన విలేకరులతో ఆయన మాట్లాడుతూ మండల పరిషత్ నిధులతో మండలంలోని పలు గ్రామాలలో ప్రజా అవసరాలకు 20 త్రాగునీటి బోరు బావులను తీయగా మండల పరిషత్ లో ఎంపీడీఓ ప్రొసీడింగు ఆర్డర్లు లేకుండా బోరు బావులు తీసి నిధులను దారి మళ్లిస్తున్నారని, అవినీతి జరిగిందని ఆ బోరు బావులకు బిల్లులు ఎలా చేస్తారని కొందరు అధికారి పార్టీ నాయకులు, తప్పుడు వార్తలు రాయించడం మానుకోవాలి అన్నారు.అలాగే ఎంపీడీఓ 11బోరు బావులకే ప్రొసీడింగ్ ఆర్డర్ ఉందని మిగతా 9 త్రాగునీటి బోరు బావులకి లేదని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు.ఈ బోరు బావులు విషయమై మండల పరిషత్ అధికారితో పాటు ఆర్డబ్ల్యూఎస్ అధికారులకు తెలిసే బోర్లు తవ్వించడం జరిగిందన్నారు. గ్రామాల్లో పంచాయతీల సర్పంచుల తీర్మానాలను అనుసరించి గ్రామాల్లో ప్రజలకు తాగునీటి బోరు బావులు అవసరం ఉందని చెప్పడంతో మండల పరిషత్ నిధులతో బోర్లు తీయడం జరిగిందని ఇలాంటి ప్రజా ఉపయోగకరమైన పనులు చేస్తే దృశప్రచారం చేయడం తగదన్నారు.వీటిపై దుష్ప్రచారం చేసే అధికార పార్టీ నాయకులకు గ్రామ పంచాయతీలకు చెందిన నిధులు కూటమి ప్రభుత్వం ప్రక్కతోవ పట్టించడం కనిపించలేదా అలాగే గ్రామాల అభివృద్ధి కుంటు పడడం తెలియదా అంటూ మండిపడ్డారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ అడపా ఈశ్వర రావు, భోజంకి శ్రీనివాస్, మెలిపాక రమణ, తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలి : కోట్ల కృష్ణ

విశాలాంధ్ర - చీపురుపల్లి : గత మూడు సంవత్సరాలుగా నత్తనడకగా కొనసాగుతున్న చీపురుపల్లి రైల్వే పై ఓవర్ బ్రిడ్జి పనులను త్వరితగతన పూర్తి చేయాలని జనసేన పార్టీ జిల్లా కోఆర్డినేటర్ కోట్ల కృష్ణ అన్నారు. మంగళవారం నాడు చీపురుపల్లి పట్టణంలో జరుగుతున్న పై ఓవర్ బ్రిడ్జి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడేళ్లుగా బ్రిడ్జి పనులు పూర్తి కాకపోవడం వలన ప్రజలు నానా అవస్థలు గురవుతున్నారని, ప్రజల అవస్థలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తారని ఈ సందర్భంగా ఆయన వివరించారు. ప్రస్తుత జాప్యానికి గల కారణాలు ఎన్ని ఉన్నా సమస్యలను పరిష్కరించే దిశలో కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. మా దృష్టికి వచ్చిన విషయాలను అధ్యయనం చేసి శాసనసభ్యులకు, అధికారుల దృష్టికి తీసుకొని వెళ్లి వీలైనంత త్వరలో పనులు పూర్తి చేసేలా కృషి చేస్తామని తెలియజేయడం జరిగింది.

విద్యార్థులులకు నులు పురుగుల మందులు పంపిణీ

విశాలాంధ్ర - పూసపాటిరేగ : మండలంలో కొవ్వాడ అగ్రహారం గ్రామ సర్పంచ్ కోట్ల రఘు గ్రామంలో గల పాఠశాల విద్యార్థుల కు మంగళ వారం నులు పురుగుల మందులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లలు ఆరోగ్యం పై చాలా జాగర్త అవసరమని క్రమం తప్పకుండా చిన్నపిల్లల టీకాలు వేయడం వల్ల పిల్లలు ఆరోగ్యంగా ఉండి చదువు ,ఆటలలో చక్కటి శ్రద్ధ కనబరుస్తారని. పిల్లల ఆరోగ్యం కోసం విశాలమైన ఆట స్థలాన్ని ఎన్నో ప్రతి కూల పరిస్థి తిలో తయారు చేశానని. పిల్లలు బాగుంటేనే రేపటి దేశ భవిష్యత్ బాగుంటుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన సర్పంచ్ కోట్ల రఘు తోపాటు పాఠశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

నిర్దిష్ట కాల పరిమితిలో అభియోగ పత్రాలు దాఖలు చెయ్యాలి

జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపిఎస్

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : జిల్లాలోని వివిధ పోలీసు స్టేషనుల్లో పని చేస్తున్న ఎస్ఐలు, సిఐలు, డిఎస్పీలతో జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ జూమ్ కాన్ఫరెన్సు నిర్వహించి, పోలీసు స్టేషనుల్లో నమోదైన క్రిమినల్ కేసుల్లో దర్యాప్తును వేగవంతంగా పూర్తి చేసి, నూతన చట్టాలకు అనుగుణంగా నిర్దిష్ట కాల పరిమితిలో నిందితులపై సంబంధిత న్యాయ స్థానాల్లో అభియోగ పత్రాలు దాఖలు చేయాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ - నూతన క్రిమినల్ చట్టాలకు అనుగుణంగా 10సం.లు కంటే ఎక్కువగా శిక్షలు విధించే క్రిమినల్ కేసుల్లో 90రోజుల్లోను, అంతకంటే తక్కువ కాలం శిక్షలు విధించే కేసుల్లో 60రోజుల్లోగా నిందితులపై సంబంధిత న్యాయ స్థానాల్లో అభియోగ పత్రాలు దాఖలు చేయాలనిఅధికారులను ఆదేశించారు. వివిధ పోలీసు స్టేషనులు పరిధిలో దర్యాప్తులోగల గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులను జిల్లా ఎస్పీ సమీక్షించి, ఆయా కేసుల్లో దర్యాప్తు పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. వివిధ కేసుల్లో దర్యాప్తు పెండింగులో ఉండుటకు గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకొని, దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేసి, అభియోగ పత్రాలు దాఖలు చేయాలన్నారు. దర్యాప్తు పెండింగులో ఉన్న కేసుల్లో సంబంధిత మెడికల్ ఆఫీసరు, రెవెన్యూఅధికారులు, రీజనల్ ఫోరెన్సిక్ ల్యాబ్ నుండి పెండింగులో ఉన్న రిపోర్టులు, నివేదికలను త్వరితగతిన పొందాలన్నారు. ఇందుకు అవసరమైతే ప్రత్యేకంగా ఒక అధికారిని లేదా సిబ్బందిని నియమించి, సంబంధిత అధికారుల నుండి నివేదికలు, రిపోర్టులను పొందాలన్నారు. దర్యాప్తు వివరాలను ఎప్పటికప్పుడు ఈ సాక్ష్య యాప్‌లోను, సి.సి.టి.ఎన్.ఎస్.లోను అప్లోడు చెయ్యాలని దర్యాప్తు అధికారులను ఆదేశించారు. గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల్లో అభియోగ పత్రాలు దాఖలు చేసే ముందు కేసులకు సంబంధించిన అన్ని పత్రాలు సక్రమంగా ఉన్నవి లేనిది పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. న్యాయస్థానాల్లో ప్రాసిక్యూషను పూర్తిచేసేందుకు ఈ-సమన్స్ ను త్వరితగతిన అమలు చేయాలన్నారు. దర్యాప్తు అధికారులు తరుచూ న్యాయ స్థానాలకు వెళ్ళి, ప్రాసిక్యూషను సక్రమంగా జరుగుతున్నది లేనిది, నిందితులు కోర్టులకు సక్రమంగా హాజరవుతున్నది లేనిది పరిశీలించాలన్నారు. నిందితులు శిక్షింపబడే విధంగా సాక్ష్యాలను దాఖలు చేయాలని, సాక్షులు తమ సాక్ష్యాన్ని న్యాయ స్థానాల్లో చెప్పే విధంగా చూడాలని అధికారులను జిల్లా ఎస్పీ వకుల్ జందల్ ఆదేశించారు. ఈ జూమ్ కాన్ఫరెన్సులో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, విజయనగరం డిఎస్పీ ఎం.శ్రీనివాసరావు, బొబ్బిలి డిఎస్పీ జి.భవ్యరెడ్డి, చీపురుపల్లి డిఎస్పీ ఎస్.రాఘువులు, పలువురు సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

2963 మందికి ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

విశాలాంధ్ర - జామి : జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా 2963 మందికి అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేసినట్లు జామి పి.హెచ్.సి. వైద్యాధికారి డాక్టర్ ఆర్.సామ్రాజ్య లక్ష్మి తెలిపారు. జామి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల చేత ఆల్బెండజోల్ మాత్రలను వైద్యాధికారులు డా.సామ్రాజ్యలక్ష్మి, డా.నాగశ్వేత మంగళ వారం మధ్యాహ్నం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అన్ని అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలో ఉన్న వారికి మాత్రలను పంపిణీ చేశారు. ఈ పంపిణీ కార్యక్రమంలో ఎమ్.ఈ.ఓ. జయ శ్రీ, హై స్కూల్ ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు శేఖర్ కుమార్, సిహెచ్ఓ ఫ్లొరెన్స్, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ డీ వార్మింగ్ డే కార్యక్రమం

విశాలాంధ్ర - మెరకముడిదాం : మండలంలో పి.హెచ్.సి పరిధిలో గల స్కూల్స్ అంగన్వాడీ సెంటర్స్ కేజీబీవీ, కాలేజీలను వార్మింగ్ డే కార్యక్రమంను అల్బెండ జోల్ మాత్రలు నిర్వహణ ను పరిశీలించడం అయినది. మెరక ముడిదాం పీ హెచ్ సి పరిధిలో మొత్తం - 2723 మందికి గాను 2695 (99%) మంది బాల బాలికలు అందరికి డి వర్మింగ్ ను ఎం.పి.డి.ఓ, ఎం.ఈ.ఓ డాక్టర్ కె.అజిత్‌బాబు, సి.హెచ్.ఓ, ఈఓపిఆర్‌డి ఐ.సి.డి.ఎస్. వారి పర్యవేక్షణలో నిర్వహించడ మైనది. ఈ కార్యక్రమము లో అల్బెండజోల్ మాత్రలు అన్ని అంగన్వాడీ కేంద్రాలు స్కూల్స్ ప్రభుత్వ ప్రైవేట్ కళాశాలలలో ఇవ్వడ మైనది. సూపర్వైజర్స్ ఎమ్ ఎల్ హెచ్ పిఎస్, ఏ ఎన్ ఎం అంగన్వాడీకార్యకర్తలు,ఆశా కార్య కర్తలు పాల్గొన్నారు. బాల బాలికలు అందరికీ ఈ రోజున హెండ్ వాష్ పై అవగాహన కల్పించి, సీజనల్ వ్యాధులు రాకుండా కాచి చల్లార్చిన నీటిని త్రాగమని అవగాహన కల్పించరు.

ఇన్నాళ్ళుకు గుర్తుకు వచ్చిందా..!

దేవాదాయశాఖ భూముల ఆక్రమణపై అధికారుల కొరడా

అక్రమ నిర్మాణాన్ని తొలగించిన అధికారులు

విశాలాంధ్ర - జామి : ఇన్నాళ్ళకు దేవాదాయశాఖ అధికారులకు చలనం వచ్చింది. తమ ఆస్థులను ఏళ్ల తరబడి ఆక్రమించుకుని పలు నిర్మాణాలు చేపట్టినా పట్టించుకోని అధికారులు ఓ వ్యాపారి చిన్న రేకుల షెడ్డును దేవాదాయశాఖ భూములలో వేస్తే మాత్రం ఏదో కొంపలు మునిగి నట్లు ఆగమేఘాల మీద వచ్చి నిర్మాణాన్ని కూల్చి వేసారు. అదే దేవాదాయశాఖకు చెందిన ఇతర భూముల పరిస్థితిపై మాత్రం వీరు పట్టించుకోరని స్థానికులు ఆరోపిస్తున్నారు. వివరాల్లోకి వెళితే మండల కేంద్రమైన జామికి సమీపంలో భీమసింగిరోడ్లఓ బంగారమ్మ ఆలయం ఎదురుగా ఓవ్యాపారి కొన్నాళ్ళు క్రితం స్థానికంగా సాగులో ఉన్న రైతునుంచి సర్వే నెం. 151/3లోని కొంత భూమిని కొనుగోలు చేసారు. ఎవరి అభ్యంతరాలు లేకపోవడంతో రేకుల షెడ్ వేసాడు. దీనిపై కొందరు దేవాదాయశాఖ దృష్టికి ఫిర్యాదు రూపంలో తీసుకువెళ్ళడంతో దేవాదాయశాఖ ఎసి, శ్రీపైడితల్లెమ్మ ఆలయ కార్య నిర్వాహనాధికారి శిరీష ఆధ్వర్యంలో సూపరింటెండెంట్ వై.వి.రమణి ఎస్‌కోట ఇన్స్‌పెక్టర్(దేవాదాయశాఖ) ఆధ్వర్యంలో నిర్మాణాన్ని జెసిబి సాయంతో కూల్చి వేసారు. అనంతరం ఈస్థలంలో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేసారు. ఈస్థలం శ్రీపైడితల్లెమ్మవారి ఆలయానికి చెందినది అని ఎవరైనా ఆక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎసి శిరీషా మాట్లాడుతూ జామి మండలంలోని భీమసింగి శ్రీవేణుగోపాల స్వామికి చెందిన 151తో పాటు 157, 158, 159, 160, 169, 174, 179, 182, 189, 32 ,18,21, 188, 167, 184, 166206 లలో సబ్ డివిజన్ల వారీగా 55ఎకరాల 78సెంట్లు భూమి ఉందని ఈభూములను అమ్మకాలు, కొనుగోలు చేసినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కేంద్ర ప్రభుత్వం కొత్త రైల్వే జోన్ గెజిట్ నోటిఫికేషన్ వెంటనే విడుదల చెయ్యాలి

విశాలాంధ్ర - విజయనగరం రూరల్ : విశాఖపట్నం కేంద్రంగా కొత్తగా ఏర్పాటు చేసిన దక్షిణ కోస్తా రైల్వే జోన్ కి సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్ కేంద్ర ప్రభుత్వం వెంటనే విడుదల చెయ్యాలని లోక్ సత్తాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం రైల్వే స్టేషన్ వద్ద పార్టీ నాయకులు, ప్రయాణికుల తో కలిసి నిరసన వ్యక్తం చేశారు ఈ సందర్భంగా భీశెట్టి మాట్లాడుతూ రాష్ట్ర విభజన చట్టం షెడ్యూల్ 8లో రైల్వే జోన్ అంశం స్పష్టంగా ఉండి కూడా పదకుండు సంవత్సరాలు పాటు ఈ అంశాన్ని కేంద్ర ప్రభుత్వం పక్కన పెట్టేసిందని, 2025 జనవరి 8న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కొత్త రైల్వే జోన్‌కి శంకుస్థాపన చేసి ఎనిమిది నెలలు దాటుతున్నా నేటికీ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చెయ్యలేదని అక్టోబర్ రెండు గాంధీ జయంతి రోజు నాటి నుండి అయినా దక్షిణ కోస్తా రైల్వే (సౌత్ కోస్ట్) జోన్ స్వతంత్రంగా పనిచేసేలా కేంద్ర ప్రభుత్వం చొరవ చూపాలని భీశెట్టి కోరారు. విశాఖపట్నం,విజయవాడ, గుంటూరు, గుంతకల్లు, డివిజన్లతో కూడిన ఈ కొత్త జోన్‌లో జీఎం సందీప్ మాథుర్,డిఆర్ఎమ్,లతో పాటు వివిధ విభాగాల అధిపతులను నియమించినప్పటికి రాజ్యం లేని రాజుల పరిస్థితి లాఉందని రైల్వే ఉద్యోగుల్లో, ప్రయాణికుల్లో కూడా సందిగ్ధం ఉందని, జోన్ నిర్ణయం ప్రకటించాక కూడా తాత్సారం జరగడం వెనుక కేంద్రంలో ఉన్న ఒడిశా నేతలు ఉన్నట్టు ప్రచారం జరుగుతోందని రాష్ట్ర ఎంపిల్లో విశాఖపట్నం ఎంపీ భరత్ తప్ప మిగిలిన ఎంపీలు మాట్లాడకుండా మౌనం వహించడం సరికాదని కేంద్ర ప్రభుత్వం పై వత్తిడి తెచ్చి వెంటనే దక్షిణ కోస్తా(సౌత్ కోస్ట్) కొత్త రైల్వే జోన్ గెజిట్ నోటిఫికేషన్ విడుదల జరిగేలా చూడాలని భీశెట్టి కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో పార్టీ నాయకులు అల్లంశెట్టి నాగభూషణం, రాయి పద్మావతి, తాత్రాజు రాజారావు, పోలుపర్తి అప్పారావు, శిమ్మ శ్రీను, బోర రమేశ్ తుమ్మగంటి రామ్మోహన్ రావు, విడకల ప్రభాకరరావు, జలంత్రి రామచంద్ర రాజు, ఇప్పలవలస గోపి, కనకాచారి, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

విశాలాంధ్ర - వేపాడ : మండలంలోని బొద్దాం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నవోదయ సైనిక్ స్కూల్ ప్రవేశానికి అవసరమైన స్టడీ మెటీరియల్ అందజేశారు. బొద్దాం గ్రామానికి చెందిన జే.రామకృష్ణ బెంగళూరులో సాఫ్ట్వేర్ ఉద్యోగం చేస్తున్నారు. బొద్దాం ప్రాథమిక పాఠశాలలో 3వ తరగతి నుండి 5వ తరగతి వరకు చదువుతున్న 39 మంది విద్యార్థులకు నవోదయ, సైనిక్ స్కూళ్లలో ప్రవేశానికి అవసరమైన ఏర్పాటు చేశారు. పిల్లలందరికీ అవసరమైన రూ.15 వేల 990 రూపా యల విలువ గల 39 స్టడీ మెటీరియల్ లను పాఠశాల ప్రధానోపాధ్యాయునికి అందజేశారు.పాఠశాల తరపున, గ్రామం తరపున పాఠశాల విద్యార్థులు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలియజేయడంతో పాటు హర్షం వ్యక్తం చేశారు.

34వ డివిజన్‌కు ఉప ఎన్నిక

విశాలాంధ్ర - విజయనగరం : రాష్ట్రంలో వివిధ కారణాలతో ఖాళీ అయిన నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాల్లో 55 కార్పొరేటర్లు, కౌన్సిలర్ల పదవులకు సెప్టెంబర్ 17 వ తేదీలోగా ఉప ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ కసరత్తు చేపట్టింది. ఈ నేపథ్యంలో విజయనగరంలోని 34 వ డివిజన్ లో కార్పొరేటర్ బాలి పైడిరాజు మరణంతో ఖాళీ అయిన ఆ స్థానానికి ఉప ఎన్నిక నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి డివిజన్ వ్యాప్తంగా ఉన్న ఓటర్ల ఫోటోలతో కూడిన జాబితాను నిర్ధారించి, ప్రచురించేందుకు నగరపాలక సంస్థ అధికారులు సిద్ధమవుతున్నారు. దీంతో మంగళవారం కార్యాలయంలో సచివాలయ కార్యదర్శులతో కమిషనర్ పల్లి నల్లనయ్య సమావేశం నిర్వహించారు.త

కార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డాయి

విశాలాంధ్ర - జామి : భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ కార్మికుల, ఉద్యోగుల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల తో రోడ్డున పడ్డాయని కూటమి ప్రభుత్వం వెంటనే కార్మికుల, ఉద్యోగుల పిఎఫ్, గ్రాట్యుటీని ఇప్పించాలని లోక్ సత్తాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి, రాష్ట్ర సూక్ష్మ, మధ్యతరగతి పరిశ్రమల, ఎన్నారై వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ని మంగళవారం క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందచేసినట్టు తెలిపారు జామిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ, కార్మికుల, రైతుల, ఉద్యోగుల సమస్యలు ఇప్పటికి పెండింగులో ఉన్నాయని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుండి మంత్రి కొండపల్లికి అనేక సార్లు కార్మికుల సమస్యలపై వివరాలు అందచేసామని రాష్ట్ర సచివాలయంలో కార్మిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ యువరాజ్ తో కూడా సమావేశమై కార్మికులకి ఉద్యోగులకు పిఎఫ్, గ్రాట్యుటీ వెంటనే చెల్లించాలని కోరామని, ప్రతి క్యాబినెట్ మీటింగ్ లో తమ కార్మికుల సమస్యలతో పాటు ఫ్యాక్టరీ పై రాష్ట్ర ప్రభుత్వం తమ అభిప్రాయం వ్యక్తం చేస్తుందని ఎదురు చూస్తున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆ దిశగా అడుగులు వెయ్యడం లేదని భీశెట్టి ఆవేదన వ్యక్తంచేశారు, చాలా మంది కార్మికులు ఆందోళన తో చనిపోయారని,మంత్రి కొండపల్లి శ్రీనివాస్ బాధ్యత తీసుకోకపోతే కార్మికుల, ఉద్యోగుల కుటుంబాలు తీవ్రంగా నష్టపోతాయని, ఉద్యోగుల, పిల్లలు చదువుకోవడం కూడా కష్టంగా మారిందని, సుగర్ ఫ్యాక్టరీపై కూడా రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన విడుదల చేయాలని మంత్రిని కోరామని భీశెట్టి తెలిపారు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సానుకూలంగా స్పందించి ప్రభుత్వం పై వత్తిడి తెచ్చి పిఎఫ్, గ్రాట్యుటీ విడుదల అయ్యేటట్టు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని భీశెట్టి అన్నారు.

వెట్టిచాకిరీ నిర్మూలనకు మరింత పర్యవేక్షణ అవసరం

విశాలాంధ్ర - విజయనగరం, కంటోన్మెంట్ : వెట్టి చాకిరి నిర్మూలనకు క్షేత్ర స్థాయిలో అధికారుల పర్యవేక్షణ మరింత అవసరమని జిల్లా న్యాయ సేవల అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జ్ ఎ.కృష్ణ ప్రసాద్ అన్నారు. విజయ నగరం జిల్లా న్యాయ సేవల అధికార సంస్థ, నేచర్ సంస్థల ఆధ్వర్యంలో అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమానికి, అభివృద్ధికి నేషనల్ లీగల్ సర్వీస్ అథారిటీ గైడ్ లైన్స్ పై అవగాహన కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసంఘటిత కార్మికులకు సహకరించే చట్టాలపై వారికి అవగాహన కల్పించడంతో పాటు వారి హక్కులు కాపాడుకోవడానికి అవసరమైన సహాయ సహకారాలు అందించడం గుతోందనీ, అలాగే వెట్టిచాకిరి నిర్మూలనకు సంబంధిత శాఖ అధికారులందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.కార్మిక శాఖ సహాయ కమిషనర్ రమాదేవి మాట్లాడుతూ ఫిబ్రవరి 9ని వెట్టిచాకిరీ నిర్మూలన దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు.వెట్టిచాకిరీ విముక్తి కి అనేక చర్యలు తీసుకుంటున్నామని, అటువంటివారికి షెల్టర్ ఏర్పాటు చేయడంతో పాటు ఆరికంగా కూడా 35వేల రూపాయల సహాయం అందించడం జరుగుతోందన్నారు. చైల్డ్ రైట్స్ ఫోరం కన్వీనర్ పి.చిట్టిబాబు మాట్లాడుతూ అసంఘటిత కార్మికులు వారు పనిచేసే చోట అనేక ఇబ్బందులను ఎదుర్కొంటు న్నారన్నారు. జిల్లాలో అనేక చోట్ల బాల కార్మికులున్నారన్నారు. పని బానిసత్వం లేని జిల్లాగా విజయనగరం జిల్లా రూపొందాలన్నారు. విజయనగరం డిఎస్పీ ఎం. శ్రీనివాస రావు మాట్లాడుతూ అనేక ఆర్థిక కారణాల వల్ల తల్లిదండ్రులు పిల్లలను పనుల్లోకి పంపుతున్న పరిస్థితి వుందన్నారు. శాఖా పరంగా ఎస్ ఎస్టీ లకు సంబంధించి అంశాలపైన, డ్రగ్స్ మీద అనేక అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో డిఐసి అసిస్టెంట్ డైరెక్టర్ బి.రామకృష్ణ పాల్గొన్నారు.

మహారాజా కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో నష ముక్త్ భారత్ అభియాన్

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : స్థానిక మహారాజా కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో, బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో నష ముక్త్ భారత్ అభియాన్ అవగాహనసదస్సునిర్వహించబడిందని కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎం.రామయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సిస్టర్ సరస్వతి, సిస్టర్ వైష్ణవి పాల్గొన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూమన ఆలోచనలు నియంత్రణలో ఉండాలని, మత్తు పదార్థాలకు బానిస కాకుండా ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపాలని విద్యార్థులకు పలు సూచనలు, జాగ్రత్తలు వివరించారు.

ప్రతి కార్యకర్త ఆదర్శనీయంగా పనిచేయాలి

విశాలాంధ్ర - చీపురుపల్లి : అంగన్వాడి కేంద్రాల్లో గల ప్రతి కార్యకర్త ఆదర్శనీయంగా పనిచేస్తూ పిల్లలకు సకాలంలో పౌష్టికాహారం అందజేయాలని చీపురుపల్లి సెక్టార్ సూపర్వైజర్ పి శశికళ సూచించారు. చీపురుపల్లి పట్టణంలోని విజయ కాలనీ ,లావేరు రోడ్డు, రామాంజనేయ కాలనీ, కేంద్రాలను మంగళవారం నాడు ఆమె పరిశీలించారు.

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అవలంబిస్తున్న విద్యావ్యతిరేక విధానాలపై ఐక్య పోరాటం

అఖిల భారత విద్యార్థి సమాఖ్య మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఒమ్మి

విశాలాంధ్ర - బొబ్బిలి : అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు పట్టణంలో ప్రభుత్వ ప్రైవేటు విద్యా సంస్థలులో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఐఎస్ఎఫ్ మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి, జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ హాజరై ముందుగా అఖిల భారత విద్యార్థి సమైక్య జెండా ఆవిష్కరణ చేశారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా విధానములో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాల పైన అలుపెరగని విద్యార్థి పోరాటాలు చేసి విద్యార్థుల హక్కుల సాధనకే పోరాటాలు చేసి అక్రమ అరెస్టులకు లాఠీ దెబ్బలకు భయపడని ఏకైక విద్యార్థి సంఘం అఖిల భారత విద్యార్థి సమైక్య కే దక్కిందన్నారు. స్వాతంత్రం మా జన్మహక్కు ని భారత జాతి ఎలుగెత్తి నినదిస్తున్న తరుణంలో పొత్తిళ్లలోనే పిడికిలి బిగించి 1936 ఆగస్టు 12న ఉత్తర ప్రదేశ్ రాజధాని లక్నో నగరంలో బెనారస్ విశ్వవిద్యాలయంలో ఆవిర్భవించింది. బ్రిటిష్ సామ్రాజ్యవాదుల పాలనకు సమాధి కట్టడంలో అగ్రభాగాన నిలిచిందని. నాటినుండి నేటి వరకు దేశాన్ని ప్రగతి పథం వైపు నడిపించడానికి పోరాటాల మార్గాన్ని ఏఐఎస్ఎఫ్ ఎంచుకుందని అన్నారు. ఏఐఎస్ఎఫ్ మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట అప్పన్న మాట్లాడుతూ మార్క్సిజం లెనినిజం తన ఊపిరిగా, శాస్త్రీయ సోషలిజం తన గమ్యంగా, సెక్యులరిజాన్ని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవడంతో పాటు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్నటువంటి విద్యా వ్యతిరేక విధానాల పైన నిరంతరం విద్యార్థులను ఐక్యం చేస్తూ పోరాట సాగిస్తుందని. సంక్షేమ హాస్టల్లో మౌలిక సదుపాయాల కోసం. స్కాలర్షిప్స్ ఫీజు రీయింబర్స్మెంట్ సాధన కోసం. విద్య కాషాయ కరణకు వ్యతిరేకంగా. ర్యాగింగ్ ఈ టీచింగ్కు వ్యతిరేకంగా ఏఐఎస్ఎఫ్ మిలిటెంట్ పోరాటాలు చేసిందని గుర్తు చేశారు. బొబ్బిలిలో ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం కు ఒక సుదీర్ఘమైన చరిత్ర ఉందని. పట్టణం లో ప్రభుత్వ జూనియర్ డిగ్రీ కాలేజ్ సాధన కోసం భవిష్యత్తులో ఏఐఎస్ఎఫ్ చేస్తున్న పోరాటాలకు విద్యార్థులు మతికిస్తూ ప్రత్యక్ష ఆందోళనలో పాల్గొవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి సుమన్ ఏఐఎస్ఎఫ్ డివిజన్ కార్యదర్శి వి శ్రావణ్ కుమార్ ఏఐఎస్ఎఫ్ బొబ్బిలి డివిజన్ కమిటీ సభ్యులు భరత్ కుమార్. కిరణ్ వాసు ప్రదీప్ దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి : డీఎస్పీ గోవిందరావు

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఐపిఎస్ అదేశాలతో పట్టణంలో ఎం.ఎస్.ఎన్ జూనియర్ కళాశాలలో విద్యార్థినీవిద్యార్థులకు శక్తి యాప్, గంజాయి, మత్తుపదార్థాలు, ఈవ్ టీచింగ్, పోక్సోచట్టాలు, పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి మహిళా పిఎస్ డిఎస్పీ ఆర్.గోవిందరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ - ప్రతీ విద్యార్థి తమ ఫోన్లో శక్తి యాప్ డౌన్లోడ్ చేసుకోవాలని, శక్తి యాప్ పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆపద సమయంలో శక్తి ఎస్.ఓ.ఎస్. కాల్ను ఉపయోగించి పోలీసుల సహాయం ఏ విధంగా పొందవచ్చునో వివరించారు. ఈవ్ టీజింగ్ వంటి సామాజిక దుష్ప్రవర్తనలు, దుష్పరిణామాలు, వాటికి చట్టపరమైన శిక్షలు గురించి, తీసుకొనే చర్యలు గురించి వివరించారు. మైనర్ బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడితే పోక్సో చట్టం ప్రకారం శిక్షలు తప్పవని హెచ్చరించారు. యువత గంజాయి, ఇతర మత్తు, మాదక ద్రవ్యాలకు బానిసలు కావద్దని జీవితాలను నాశనం చేసుకోవద్దని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. గంజాయి గురించిన సమాచారం ఏదైనా తెలిస్తే డయల్ 100/112 కు లేదా 1972 కు గాని వెంటనే తెలియజేయాలని విద్యార్థులను కోరారు. ఈ అవగాహన కార్యక్రమంలో మహిళా పిఎస్ ఎస్ఐ జి.శిరీష, 1వ పట్టణ ఎస్.ఐ బి.దేవి, శక్తి టీం సిబ్బంది మరియు కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

విశాలాంధ్ర - విజయనగరం ఫోర్ట్: నాయి బ్రాహ్మణుల షాపులకు ఫ్రీ కరెంటు 200 యూనిట్లు ఇచ్చిన సందర్భంగా మంగళవారం నాయి బ్రాహ్మణుల టౌన్ కమిటీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి పాలాభిషేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం రాష్ట్ర నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ గంధ్రేటి సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి లక్కవరపుకోట దుర్గారావు, సాధికార కమిటీ సభ్యులు, కొవ్వాడ రామకృష్ణ, జిల్లా మహిళా అధ్యక్షురాలు, అప్పల నరసమ్మ, తాట పల్లి బుజ్జిబాబు, ఆర్.లక్ష్మణరావు, ఆర్.సురేష్, శేఖర మురళి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలను వేయాలి

కలెక్టర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్

విశాలాంధ్ర - గంట్యాడ: నులి పురుగుల నివారణకు పిల్లలంతా తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలను వేసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సూచించారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని గంట్యాడ మండలం జిల్లా పరిషత్ పాఠశాలలో ఆయన మంగళవారం ప్రారంభించారు. పాఠశాల విద్యార్థుల చేత ఆల్బెండజోల్ మాత్రలను మింగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కడుపులోని నులిపురుగులను నివారించేందుకు 19 ఏళ్ల లోపు పిల్లలంతా ఈ మాత్రలను తప్పనిసరిగా వేసుకోవాలని కోరారు. కడుపులో నులిపురుగులు ఉంటే పిల్లల్లో పోషకాహార లోపం ఏర్పడుతుందని, పెరుగుదల మందగించి, బలహీనంగా తయారవుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో నులిపురుగుల వల్ల కలిగే అనర్థాలు, నిర్మూలనా పద్ధతులపై షార్ట్ ఫిల్మ్ ప్రదర్శించారు. పాఠశాలలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా క్రషర్ డస్ట్ వేయాలని, శిథిలమైన భవనాలను తొలగించాలని కలెక్టర్ ఆదేశించారు. డీఈవో మాణిక్యం నాయుడు, డి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ జీవనరాణి, ఆర్బిఎస్కే ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సుబ్రమణ్యం, ఎగ్జామ్స్ కోఆర్డినేటర్ సన్యాసిరాజు, తాసిల్దార్ నీలకంఠేశ్వర రెడ్డి ఎంఈఓ వెంకట్రావు, పాఠశాల హెచ్ఎం ఏ.ఝాన్సీ, ఉపాధ్యాయులు, ఆసుపత్రి వైద్యులు, వైద్య ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డెంకాడ: జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమం సందర్భంగా డెంకాడ జూనియర్ కాలేజ్‌లో మంగళవారం ఎంపీపీ వాసుదేవరావు ఆధ్వర్యంలో ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నులిపురుగుల వలన వచ్చు అనర్థాలను రక్తహీనత, పోషకాహార లోపం, మానసిక రుగ్మతలను నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భవాని, డాక్టర్ శివరామకృష్ణ, మండల నాయకులు, కాలేజ్ ప్రిన్సిపాల్ రమణమూర్తి, సిహెచ్ఓ యాషయ్య పాల్గొన్నారు.

మెంటాడ: పిల్లల కడుపులో క్రిములు వల్ల కలిగే అనారోగ్య సమస్యలను అంతం చేయుటకు భారత ప్రభుత్వం చేపట్టిన ప్రతిష్టాత్మకమైన జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవ కార్యక్రమం మెంటాడ కేజీబీవీలో నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జి.కల్పన మాట్లాడుతూ 1 సంవత్సరం వయస్సు నుండి 19 సంవత్సరాల వయసుగల పిల్లలందరికీ నులి పురుగుల నిర్మూలన మాత్రలు "అల్బెండ జోల్" మాత్రలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ సత్యనారాయణ, సూపర్వైజర్లు, ఏఎన్ఎం సంతోషి, ప్రిన్సిపల్ శారద ఆశ కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వేపాడ: మండలంలోని వేపాడ ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం పరిధిలోని ప్రాథమిక పాఠశాలలు, జూనియర్ కాలేజీ, అంగనవాడి కేంద్రాల్లో గల పిల్లలకు డి- వార్మింగ్ మాత్రలు పంపిణీ చేయడం జరిగిందని వైద్యాధికారి ఎం.వేణు అన్నారు. బుధవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా డి- వార్మింగ్ డే పురస్కరించుకొని ఆల్బెండజల్ 400 ఎంజి మాత్రలను విద్యార్థులచే నమలి మింగించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సేనాపతి అప్పారావు, ఎంఈఓ పి బాల భాస్కరరావు, ఉపాధ్యాయ సిబ్బంది, వైద్యాధికారిని సంజన,13 సచివాలయాల ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

గాయపడ్డ వ్యక్తికి మంత్రి కొండపల్లి పరామర్శ

విశాలాంధ్ర - దత్తిరాజేరు: మండల పరిధిలో గల రాజుల రామచంద్రపురం గ్రామానికి చెందిన తూమురోతు కృష్ణ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయాలవ్వగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మంగళవారం ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆయనతోపాటు టిడిపి మండల పార్టీ అధ్యక్షులు చప్ప చంద్రశేఖర్, మిత్తిరెడ్డి ఈశ్వరరావు, బోడసింగి సత్తిబాబు, పెద్దింటి మోహన్, గుషిడి వేణు తదితరులు పాల్గొన్నారు.

రైతుల ట్రాక్టర్ ర్యాలీలో ఎమ్మెల్యే అతిథి గజపతిరాజు



విశాలాంధ్ర - విజయనగరం ఫోర్ట్: ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం "అన్నదాత సుఖీభవ" పథకాన్ని అమలు రైతులకు ఆర్థిక సహాయం అందించిన సందర్భంగా రైతులు ఆనందం వ్యక్తం చేస్తూ, కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ మంగళవారం రైతులు ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ముఖ్య అతిథిగా శాసనసభ్యురాలు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముందుగా రాకోడు గ్రామంలో వంట పొలాల్లో భూమి పూజ చేసిన శాసనసభ్యురాలు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు తరువాత రైతులు చేస్తున్న ట్రాక్టర్ ర్యాలీని ప్రారంభించి, ర్యాలీలో పాల్గొన్నారు. ఈ ర్యాలీ జొన్నవలస, దుప్పాడ గ్రామాల మీదుగా వుడా కోలనీ, జిల్లా ఆసుపత్రి రోడ్డు, పోలీస్ బ్యారెక్స్ రోడ్డు, గూడ్స్ షెడ్, ఎమ్మార్వో కార్యాలయం మీదుగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ శ్రేణులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

విశాలాంధ్ర విజయనగరం ఫోర్ట్: ఈ నెల 16 నుంచి 20 వ తేదీ వరకు శ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వర్లు దివ్య ఆశీస్సులతో త్రైతసిద్ధాంతము ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలకు విజయనగరం శాసనసభ్యులు పూసపాటి అతిథి గజపతిరాజు కి మంగళవారం ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక జిల్లా శాఖ అధ్యక్షుడు వి.శంకరరావు తదితరులు ఆహ్వానం పలికారు. ఈ మేరకు ఆమె కార్యాలయంలో ఉత్సవాల కు సంబంధించి ఆహ్వాన పత్రికను అందించారు.. ఈ మేరకు సమితి అధ్యక్షుడు శంకరరావు మాట్లాడుతూ ప్రతి ఏటా ఈ ఉత్సవాలను జిల్లా కేంద్ర గ్రంథాలయం, గురజాడ కళాభారతి ఆడిటోరియంలోనే ఘనంగా నిర్వహిస్తున్నామని, ఇందులో భాగంగానే ఈ ఏడాది కూడా అక్కడే ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. అనంతపురం శ్రీకృష్ణ మందిరం ఆదేశాలు మేరకు గత ఏడాది మాదిరిగానే ఈ ఏడాది ప్రజాప్రతినిధులు, అధికారుల, స్వచ్ఛంద సంస్థల, భక్తులు ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలను నగరంలో ఐదు రోజులు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రములో ఆగస్టు నెల 20న పెద్ద సంఖ్యలో భారీగా ఊరేగింపు చేయనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ ఉత్సవాల్లో పాల్గొని దేవాదిదేవుడు శ్రీకృష్ణుని ఆశీస్సులు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో సభ్యులు నాయుడు, రామకృష్ణ,సూరిబాబు, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర-2047 విజన్ ప్లాన్ సమావేశం

విశాలాంధ్ర - గజపతినగరం: గజపతినగరం ఎంపీడీవో ఆఫీసు నందు మంగళవారం మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్వర్ణాంధ్ర - 2047 విజన్ యాక్షన్ ప్లాన్ నియోజకవర్గస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అధికారులతో నియోజకవర్గంలో గల నీటిపారుదలపై సాగుభూమి మరియు వర్షాధార పై సాగుభూమి గూర్చి వివరాలు చర్చించారు. అలాగే వ్యవసాయ రంగంలో తీసుకోవలసిన చర్యలు ఎంతవరకు వచ్చాయో వాటి వివరాలు గూర్చి చర్చించారు. హార్టికల్చర్ రంగంలో ఆయిల్ ఫామ్ కు గూర్చి పాల సేకరణ ఎన్ని లీటర్ల ఉత్పత్తి, వినియోగం ఎంత ఉంది అని చర్చించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ ప్రమీల గాంధీ, నియోజకవర్గంలోని అన్ని మండలాల తాసిల్దారులు, ఎంపీడీవోలు, సి వి ఏ పి టీం, స్థానిక మార్కెట్ కమిటీ చైర్మన్ వీవీ వి గోపాల రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రి కాంట్రాక్ట్ కార్మికుల పి.ఎఫ్ బకాయిలు చెల్లించాలి

రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బుగత అశోక్ డిమాండ్

విశాలాంధ్ర - గజపతినగరం: గజపతినగరం ఏరియా ఆసుపత్రిలో పని చేస్తున్న శానిటేషన్, పెస్ట్ కంట్రోల్, సెక్యూరిటీ గార్డులు, సూపర్వైజర్లు మొదలైన కాంట్రాక్టు వర్కర్ల పీఎఫ్ బకాయిలు చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటీయుసి అనుబంధం) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బుగత అశోక్ డిమాండ్ చేశారు. వెట్టి చాకిరీ చేయించుకుంటున్న హాస్పిటల్ ఆర్.ఎం.ఓ, పి.ఆర్.ఓలు కాంట్రాక్టర్లు చేత పెరిగిన జీతాలు, పిఎఫ్ బకాయి డబ్బులు, ఈ.ఎస్.ఐ కార్డులు ఇప్పించడంలేదని, హాస్పిటల్ విస్తీర్ణం, రోగులు, మంచాలు, వార్డులు సంఖ్య పెరగడం వలన వర్కర్లపై తీవ్రమైన పని ఒత్తిడికి గురై అనారోగ్యం పాలవుతున్నా వర్కర్ల సంఖ్య పెంచడం లేదన్నారు. కనీసం చట్ట ప్రకారం సెలవులు మంజూరు చేయడం లేదని, ఇలాంటి అనేక సమస్యలతో నరక యాతన అనుభవిస్తూ ప్రజలు ఇబ్బందులు పడకూడదని మానవతా దృక్పథంతో వర్కర్లు పనులు చేస్తున్నారన్నారు. గజపతినగరం ఏరియా ఆసుపత్రి ముందు నిరసన ధర్నా చేపట్టి సూపరింటెండెంట్‌కి వినతి పత్రం సమర్పించడం జరిగింది. ప్రాణాలు లెక్కచేయకుండా పనులు చేస్తున్న శానిటేషన్, పెస్ట్ కంట్రోల్ వర్కర్లు, సెక్యూరిటీ గార్డులు, సూపర్వైజర్లు జీవితాలను ఎన్ని ప్రభుత్వాలు మారుతున్న కాంట్రాక్ట్ దళారీ వ్యవస్థ చేతుల్లో పెట్టేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నేడు అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వ వ్యవహార శైలి కూడా యధాతధంగా ఉందని విమర్శించారు. కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కారం చేసే వరకు దశల వారీగా పోరాటాలు కొనసాగిస్తామని బుగత అశోక్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఐటీయుసి జిల్లా కార్యదర్శి పురం అప్పారావు, డి.హెచ్.పి.ఎస్ జిల్లా కార్యదర్శి సంతోష్, ఆసుపత్రి యూనియన్ నాయకులు గణ, నారాయణమ్మ, మేరీ, ఆసుపత్రిల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్ వర్కర్స్, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

సీతం ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ లైబ్రేరియన్ల దినోత్సవం

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: సీతం ఇంజనీరింగ్ కళాశాల సెంట్రల్ లైబ్రరీ హాల్‌లో జాతీయ లైబ్రేరియన్ల దినోత్సవం, అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని సంయుక్తంగా నిర్వహించింది. దేశంలో లైబ్రరీ సైన్స్ పితామహుడు డాక్టర్ ఎస్.ఆర్. రంగనాథన్ జయంతిని పురస్కరించుకుని జాతీయ లైబ్రేరియన్ల దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా పుస్తక విరాళ కార్యకలాపాలు నిర్వహించబడ్డాయి విద్యార్థులు అధ్యాపకులలో లైబ్రరీల ప్రాముఖ్యత, పఠన అలవాట్లు, విద్యా వృద్ధిలో జ్ఞాన భాగస్వామ్యం గురించి అవగాహన కల్పించారు. అంతర్జాతీయ యువజన దినోత్సవం 2025 ఎస్‌డిజిస్ అంతకు మించి స్థానిక యువత చర్యలు" అనే ఇతివృత్తంతో జరుపుకున్నారు. ముఖ్య అతిథి డాక్టర్ ఎం. సాయి దేవమణి మాట్లాడుతూ స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలను సాధించడంలో, సామాజిక, పర్యావరణ శ్రేయస్సుకు దోహద పడటంలో యువత పాత్రను తెలిపారు. డాక్టర్ సీతం ప్రిన్సిపాల్ డివి రామమూర్తి మాట్లాడుతూ జ్ఞాన కేంద్రాలుగా గ్రంథాలయాల కీలక పాత్రను పోషిస్తున్నాయన్నారు. సీతం కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం. శశిభూషణరావు మాట్లాడుతూ విద్యా నైపుణ్యాన్ని సామాజిక బాధ్యతతో సమతుల్యం చేయడం యొక్క ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. సమాజ ఆధారిత కార్యక్రమాలలో పాల్గొనడంలో విద్యార్థులు చూపిన ఉత్సాహాన్ని ఆయన ప్రశంసించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నోడల్ ఆఫీసర్ ఎన్. సతీష్‌కుమార్, ఫిజికల్ డైరెక్టర్ జె. మహేశ్వరరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ బి. జగదీష్, లైబ్రరీ కమిటీ చైర్‌పర్సన్ భార్గవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సభ్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ అరెస్ట్ అన్యాయం

విశాలాంధ్ర విజయనగరం ఫోర్ట్: ప్రజాస్వామ్యంలో ఓట్లను దుర్వినియోగం చేసే బిజెపి ప్రభుత్వం పై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ గొంతు విప్పి ప్రశ్నించడం నేరంగా భావించడం తగదని జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ అధ్యక్షులు ఎస్కే సమీర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు హక్కు అనేది మన భారత రాజ్యాంగం మనకు ఇచ్చిన వరం అటువంటి ఓట్లను దుర్వినియోగం చేయటం మోడీ ప్రభుత్వానికి సమంజసం కాదన్నారు. బ్రిటిష్ వాళ్ళతో పోరాడి తమ ప్రాణాలను అర్పించి స్వాతంత్రాన్ని తీసుకొచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదన్నారు. విభిన్న మతాల నిలయం మన భారతదేశం. అటువంటి దేశంలో కులమతాల చిచ్చు పెడుతూ భారతీయుల జీవన విధానాన్ని సోదర భావాన్ని కాలరాస్తున్న బిజెపి ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పే రోజు దగ్గర్లోనే ఉందన్నారు. ప్రతిపక్షాలు కూడా దీనిపై నోరు విప్పకపోవటం బాధాకరం. రాహుల్ గాంధీ అరెస్టుపై మేము ఎటువంటి ఉద్యమాలు చేయడానికి అయినా సిద్ధంగా ఉన్నామన్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం

విశాలాంధ్ర - తెర్లాం: మండలంలో ఎమ్మార్ అగ్రహారం గ్రామంలో రచ్చ బండ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ ప్రతినిధి లొట్టి వెంకట్రావుతో తహసీల్దార్ హేమంత్ కుమార్ మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ కొరకు ఎం ఆర్ అగ్రహారం, రంగప్పవలస గ్రామాల్లో 26 గ్రీవన్స్ వచ్చాయన్నారు. వాటిని క్షేత్ర స్థాయిలో విచారణ చేయడం జరిగిందని తహసీల్దార్ హేమంత్ కుమార్ తెలిపారు.

నేడు అన్నదాత సుఖీభవ ర్యాలీ

విశాలాంధ్ర - వేపాడ: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేసి వ్యవసాయ రైతులకు అన్నదాత సుఖీభవ పథకం అందించిన సందర్భంగా,లక్కవరపుకోటలోని గోల్డ్ స్టార్ సెంటర్ నుంచి శృంగవరపుకోట దీవి బొమ్మ గుడి వరకు అన్నదాత సుఖీభవ ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని మండల పార్టీ అధ్యక్షులు గోంప వెంకటరావు తెలిపారు. బుధవారం శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ళ లలితకుమారి ఆధ్వర్యంలో ఉదయం 9 గంటలకు నిర్వహించనున్న అన్నధాత సుఖీభవ ట్రాక్టర్ ర్యాలీ ప్రారంభం అవుతుందన్నారు.

సబ్ జైల్ ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర, విజయనగరం, కంటోన్మెంట్ :జాతీయ న్యాయ సేవా అధికార సంస్థ న్యూఢిల్లీ వారి యొక్క ఉత్తర్వులు మేరకు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి ఏ.కృష్ణ ప్రసాద్ విజయనగరం సబ్ జైలును ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. కారాగారంలో ఉన్న ఖైదీలకు న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించినారు. వీరికి పలు చట్టాలపై అవగాహన కల్పించినారు.ఖైదీల పట్ల సిబ్బంది గాని తోటి ఖైదీలు గాని ఎటువంటి వివక్షత చూపించరాదని సుప్రీంకోర్టు ఇచ్చిన జడ్జిమెంట్ ను గురించి తెలియజేశారు. ఆ విధంగా ఖైదీల పట్ల వివక్షత చూపించిన యెడల కఠినమైన చర్యలు ఉంటాయని, ఆ విషయమై జైలు సూపరిండెంట్ ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా సబ్ జైల్లో కొనసాగుతున్న జైల్ లీగల్ ఎయిడ్ క్లినిక్ లను తనిఖీ చేశారు.జైలు లీగల్ ఎయిడ్ క్లినిక్స్ నిర్వహిస్తున్న విధులను పర్యవేక్షించారు .జైల్ క్లినిక్లను సందర్శించే న్యాయవాదులు పారా లీగల్ వాలంటీర్లు నిర్వహిస్తున్న విధులను గురించి ఆరా తీశారు. జైలులో ఉన్న ఖైదీల వివరాలను ప్రతి ఒక్కరిని అడిగి తెలుసుకున్నారు. వంటగదిని భోజనశాలను పరిశీలించారు. స్టోర్ రూమ్ సందర్శించి వంట సరుకులను పప్పు దినుసులను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ అకస్మిక తనికి తనిఖీలో సబ్ జైలు సూపరిండెంట్ పాల్గొన్నారు.



ప్రతి పౌరుడు దేశభక్తిని కలిగి ఉండాలి

విశాలాంధ్ర - దత్తిరాజేరు : మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం సీనియర్ అసిస్టెంట్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు హర్ గర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటిపై మువ్వన్నెల జెండా ఏగరాలని అన్నారు. దేశానికి స్వాతంత్రం తెచ్చేందుకు ఎంతోమంది ప్రాణత్యాగం చేశారని, వారి ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం,రమణ, వెలుగు సీసీ,రెవిన్యూ సిబ్బంది మహిళలు తదితరులు పాల్గొన్నారు.

గజపతి నగరం: గజపతినగరం మండల మహిళా సమాఖ్య (వెలుగు) కార్యాలయం ఆధ్వర్యంలో మంగళవారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి డిఆర్డిఏ ప్రాజెక్ట్ మేనేజర్ రత్నాకర్ హాజరయ్యారు. ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆదేశాల మేరకు మండల మహిళా సమైక్య లో తిరంగా మేళ లో జీవనోపాధిలో భాగంగా మహిళలు చేస్తున్న వివిధ రకాల వ్యాపార ఉత్పత్తులైన కూరగాయలు, బట్టలు, తిను బండారాలు ఏర్పాటు చేశారు. ముఖ్యంగా ప్రతి ఒక్కరు ఈ తిరంగా కార్యక్రమంలో పాల్గొని లింక్ ద్వారా సెల్ఫీలను అప్లోడ్ చేయాలని తెలిపారు. వివో ఏలు సంఘ సభ్యురాలు మరియు కుటుంబంలో ఉన్న ఇతర సభ్యులందరూ కూడా సెల్ఫీలు తీసి లింకులో అప్లోడ్ చేయించాలని అవగాహన కల్పించారు. ప్రతి సభ్యురాలు ఇంటిపై జెండాను ఎగరవేయాలని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏపీఎం నారాయణరావు, డి ఆర్ డి ఎ నుంచి వచ్చిన ఏపిఎం లు విజయ్ కుమార్, హేమలత మరియు సీసీలు మూర్తి, సత్యనారాయణ,, రాము నాయుడు, శేఖర్, కైలాస్, వివో ఏలు, మహిళలు పాల్గొన్నారు.

మెరకముడిదాం: మండల కేంద్రమైన మెరకముడిదాంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం మండల అభివృద్ధి అధికారి జి.భాస్కరరావు ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో జెండాకు సంబంధించి మెటీరియల్‌ను ప్రదర్శనగా పెట్టి కొనుగోలు చేశారు. అనంతరం ఎండిఓ మాట్లాడుతూ నేషన్ ఒక్కటే అనే భావనతో ప్రతి ఒక్క ఇంటిపై జెండా ఎగురువేయాలని సూచించారు. ఎందరో త్యాగధనుల ఫలాన్ని ఈరోజు మనము అనుభవిస్తున్నామని, మనలో ఐక్యత పెంపొందించేందుకు, వారి త్యాగాలకు గుర్తుగా ఈ హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని చేపడుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో డి.డి.ఓ. కె.హేమ సుందర్ రావు, మండల రెవెన్యూ తాసిల్దార్ ఆకుల సులోచన రాణి, మండల అభివృద్ధి అధికారి జి భాస్కరరావు, ఎస్ హెచ్ జి సభ్యులు పాల్గొన్నారు. ఎస్. హెచ్.జి. సభ్యులు పాల్గొన్నారు.

తెర్లాం: మండలం పరిధిలో శ్రీ వెంకటేశ్వర జూనియర్ కళాశాలలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు "హర్ గర్ తిరంగా" నిర్వహించారు. కళాశాల నుంచి సుమారుగా 3 కిలోమీటర్ల వరకు అంటే తెర్లాం గ్రామ పంచాయతీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించడం జరిగింది. త్రివర్ణ పతాకం, భారత మాత, హర్ గర్ తిరంగా నినాదాలు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి జే త్రినాధరావు, ప్రిన్సిపాల్ సిహెచ్.తిరుపతిరావు, జంతు శాస్త్ర అధ్యాపకులు మడక సత్యనారాయణ, ఎన్ఎస్ఎస్ పిఓ టి.రామారావు, వాలంటీర్స్, విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు.

అలాగే మండల స్థాయి అధికారులు తహసీల్దార్ హేమంత్ కుమార్, ఎం డి ఓ ఆర్.రాంబాబు, సబ్ ఇన్స్పెక్టర్ సాగర్ బాబు హర్ ఘర్ తిరంగా ర్యాలీలో పాల్గొన్నారు. వీరితో పాటు వెలుగు ఏపీఎం ఉమామహేశ్వరరావు, అంగన్వాడీ సిబ్బంది, ఆశావర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

జామి: మండలంలోని భారతీయ జనతా పార్టీ మండల శాఖ అధ్యక్షురాలు రాయవరపు ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం స్థానిక హైస్కూల్ నుండి బస్సు స్టాండ్ వరకు హర్ ఘర్ తిరంగ కార్యక్రమం ర్యాలీ నిర్వహించారు. ఈ రాల్యీలో మాజీ సైనికులు, వివిధ పార్టీల కు చెందిన నాయకులు, అభిమానులు పాల్గొన్నరు. అందరూ జాతీయ పతాకాన్ని చేతపట్టుకొని భారత్ మాతకు జై అంటూ నినాదాలు చేశారు. ఈ సంధర్భంగా రాష్ట్ర వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్, బిజెపి కార్యవర్గ సభ్యుడు కుసుమంచి సుబ్బారావు మాట్లాడుతూ మాట్లాడుతూ పార్టీ అదేశాలు మేరకు హర్ తిరంగా కార్యక్రమం నిర్వహించడం జరిగింది తెలిపారు. ఈకార్యక్రమంలో బిజెపి పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు చొక్కాకుల అప్పారావు,యస్ కోట బిజెపి ఇన్చార్జి రామకోటి, డి.సూర్యరావు, మండల బిజెపి పార్టీ అధ్యక్షుడు యం.శ్రీను, దాశరధి,మండల టిడిపి పార్టీ నేతలు వర్రిరమణ, వి.నాయుడుబాబు, కొత్తలి సూర్యారావు,జనసేన పార్టీ మండల నాయకుడు వర్మరాజు, జిల్లా ఆర్యవైశ్య కార్యవర్గ సభ్యులు బొలిశెట్టి వేంకటేశ్వరరావు, రంజిత్ యంఇవో జయశ్రీ, హెచ్ యం శేఖర్ పలువురు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంట మువ్వన్నెల జెండా రెపరెపలాడాలి

విశాలాంధ్ర - వేపాడ : దేశభక్తి జాతీయ సమైక్యత భావాలను ప్రపంచ వ్యాప్తంగా చాటి చెప్పాలని సదుద్దేశంతో ప్రధాని మంత్రి నరేంద్ర మోడీ పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమం చేపట్టామని మండల పరిషత్ అధ్యక్షుడు దొగ్గ సత్యవంతుడు అన్నారు. మండల కేంద్రమైన వేపాడలో మండల మహిళా సమాఖ్య వెలుగు ఏపిఎం డి.సూర్య నారాయణ అధ్వర్యంలో జాతీయ పతాక ర్యాలీ నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 15 స్వతంత్ర దినోత్సవం సందర్భంగా గ్రామాల్లో ప్రతి ఇంటిపై జాతీయ పతాక జెండా ఎగరవేయలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అడపా ఈశ్వర రావు, భోజంకి శ్రీను, దేబార్కి అప్పారావు, వెలుగు వివోఏలు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యానికి నులిపురుగుల మాత్రలు ఎంతో ప్రయోజనం

విశాలాంధ్ర - కొత్తవలస : జాతీయ నులు పురుగుల నివారణా దినోత్సవ కార్యక్రమంలో భాగంగా కొత్తవలస, వియ్యంపేట పిహెచ్సిల పరిధిలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లోని పిల్లలకు వైద్యాధికారులు డా. శీతల్ వర్మ, డా.గోపాలకృష్ణ, డా.సింహాద్రి నాయుడు ఆధ్వర్యంలో ఆల్బం డాజోల్ మాత్రలను మింగించారు. ఈ కార్య క్రమంలో భాగంగా నేషనల్ లెప్రసీ ఇరాడికేషన్ ప్రోగ్రాం రాష్ట్ర సలహాదారు సత్యవతి కొత్తవలస మండలంలో పర్యటించి కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సత్యవతి మాట్లాడుతూ... ప్రభుత్వం వైద్య ఆరోగ్య రంగానికి అధిక ప్రాధాన్యతనిస్తుందన్నారు. 1 సం నుంచి 19 సం వయసు వారికి అందరికీ వయసును బట్టి, ఆల్బండాజోలు 400%ఎన్జ్% మాత్రను మింగించడం జరుగుతుందని, ఈ విధంగా ఏడాదిలో రెండు సార్లు పిల్లలకు ఈ విధంగా ఆల్బండాజోలు మాత్రలు ఇవ్వడం మంచిదని తెలిపారు. ఈవిధంగా చేయటం ద్వారా పిల్లల్లో ఉన్న నులిపురుగు చనిపోయి, రక్త శాతం పెరుగుతుంది, ఆరోగ్యం బాగు టుందన్నారు. నులిపురుగుల వలన పిల్లలో రక్త హీనత పెరిగి, అలసట, కళ్ళు తిరగటం, ఆయాసం, మనిషిలో ఎదుగుదల లేకపోవటం, తరచూ అనారోగ్యం పాలు అవటం జరుగుతుందని, ముఖ్యంగా ఆడపిల్లల్లో దీని ప్రభావం ఎక్కువుగా ఉంటుందని, ఎటువంటి ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి ఈ మాత్రలు ఇవ్వకూడదని, వారి శరీరంలో ఉన్న నులిపురుగులు కారణంగా ఈ మాత్రలు వేసుకున్న తరువాత ఎవరికైనా శరీరంపై దద్దుర్లు రావటం, వాంతులు అవటం, కళ్ళు తిరిగి పడిపోవటం వంటివి జరగవచ్చునని, ఎవరూ ఆందోళన చెందకూడదని సూచించారు. అందుబాటులో ఉన్న తమ ఆరోగ్య సిబ్బంది వద్ద అత్యవసర మందులు ఉంచటం జరిందని తెలిపారు. కొత్తవలస పిహెచ్సి పరిధిలోని 8673 మంది విద్యార్థులకు గాను 7807 మంది విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశామని డాక్టర్ శీతల్ వర్మ పేర్కొన్నారు. అలాగే వియ్యంపేట పిహెచ్సి పరిధిలో 5060 మంది విద్యార్థులకు గాను 4857 మంది విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేసినట్లు డాక్టర్ గోపాలకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఇంచార్జ్ ఎంపీడిఓ శ్రీదేవి, సిహెచ్ఓ అప్పలకొండ, ఈఓ సన్యాసినాయుడు, హెచ్ఎస్ సూరిదేముడు, హెచ్.వి బేబీరాణి, నిర్మల, లావణ్య, ఎంఎల్హెచ్పి లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యాకర్తలు, వైద్య, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

స్కూల్ బస్సును ఢీకొన్న కారు

విశాలాంధ్ర - శృంగవరపుకోట రూరల్ : ఎస్ కోట మండల కేంద్రం నుండి బొద్దాం వైపు వెళ్తున్న అమర్ కౌముదీ పాఠశాలకు బస్సును విశాఖపట్నం నుండి వస్తున్న ఒక కారు బలంగా ఢీకొట్టడంతో బస్సుకు మరియు కారుకు ముందు ప్రాంతం అంతా అయిపోయింది. అదృష్టవశాత్తు బస్సులో ఉన్న 40 మంది విద్యార్థులు క్షేమంగా బయటపడ్డారు. ప్రమాదానికి ప్రధాన కారణం కొత్తూరు ఎస్ కోట మలుపు వద్ద ఎటువంటి ప్రమాద హెచ్చరిక బోర్డులు గాని ప్రమాద నివారణ పరికరాలు గాని ఏర్పాటు చేయకపోవడమేనని పలువురు ఆరోపిస్తున్నారు. రోడ్డు భవనాల శాఖ అధికారులు ప్రమాద హెచ్చరిక పరికరాలు పటిష్టం చేస్తారని ప్రమాదాలు నివారిస్తారని ప్రజలు కోరుకుంటున్నారు.

నులిపురుగుల నివారణకు జాగ్రత్తలు పాటించాలి : డాక్టర్ అనిల్ కుమార్

విశాలాంధ్ర - లక్కవరపుకోట : నులిపురుగుల నివారణకు జాగ్రత్తలు పాటించాలని స్థానిక ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం డాక్టర్ బి అనిల్ కుమార్ తెలిపారు. మంగళవారం జాతీయ నులిపురుగుల దినోత్సవం సంద ర్భంగా స్థానిక జడ్పీ హైస్కూల్, ఏపీ ఆదర్శ పాఠశాల లో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు వేయడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ఒకటి నుంచి 19 సంవత్సరాల పిల్లలు అందరికీ మాత్ర వేయాలన్నారు, ఒకటి నుంచి రెండు సంవత్సరాల పిల్లలకు, అర ముక్క మాత్ర వేయాలన్నారు, రెండు సంవత్సరాల నుంచి 19 సంవత్సరాల వరకు ఒక మాత్ర వేయి వచ్చిన అన్నారు అనారోగ్యంగా ఉన్న పిల్లలకు మాత్రమే వేయకూడదు అన్నారు, గోరువెచ్చని నీళ్ల తో మాత్రం ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కె పార్వతి, ఆరోగ్యశాఖ రాష్ట్ర కన్సల్టెంట్ సత్యవతి, ఎంఈఓ 1, 2, కూర్మారావు,, హెచ్డి టి.రమేష్ పాల్గొన్నారు.

జీఓ 137 రద్దు చేయకపోతే ఆందోళన ఉధృతం చేస్తాం

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : విజయవాడ లోని గవర్నర్ పేట డిపోలు, పాత బస్టాండ్ ఆర్టీసీ స్థలాలను షాపింగ్ మాల్ ఏర్పాటు కొరకు జి.ఓ.నెం. 137 ద్వారా కేటాయిస్తూ ప్రభుత్వ నిర్ణయానికి వెంటనే వెనక్కి తీసుకోవాలని లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన ఉధృతం చేస్తామని ఎపిపిటిడి ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ పి. భానుమూర్తి హెచ్చరించారు. మంగళవారం ఆర్టీసీ కాంప్లెక్స్ ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ. ఆర్టీసీ ఆస్తులు కాపాడుకునేందుకు ఆర్టీసిలోని అన్ని సంఘాలు ఉద్యమంలో భాగస్వా మ్యం అవుతున్నాయని, ప్రజా రవాణా సంస్థ (ఆర్టీసి) ఆస్తులు ప్రైవేటు వ్యాపారవేత్తలకు దారాదత్తం చేస్తున్న చర్యలను ప్రజలంతా ముక్తకంఠంతో ఖండించాలన్నారు. నెం. 137 ద్వారా కట్టబెట్టిన జి.ఓను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఆగస్టు 15 నుండి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం ద్వారా ప్రతిరోజూ సుమారు 65 లక్షల మందికి సేవలు అందించవలసిన ఆర్టీసీ స్థలాలను ప్రైవేట్ వ్యక్తులకు దారాదత్తం చేయడమంటే సంస్థను ప్రైవేట్ పరం చేయడమేనని ఉద్యోగస్తులు భావిస్తున్నందున ఉద్యోగులు అంతా ఒక్కటై ప్రజా సంఘాలతో కలసి ఉద్యమాలు బాట పట్టకముందే జీఓ నెం. 137ను రద్దు చేయాలని కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసారు. దశాబ్దాల చరిత్ర కలిగిన ఆర్టీసీని నిర్వీర్యం చేయాలని చూడటం బాధాకరమన్నారు.. ఈ కార్యక్రమంలో ఏపీఎస్ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి జి.రవికుమార్. డిపో కార్యదర్శి సిహెచ్ శ్రీనివాసరావు, జిల్లా కోశాధికారి సిహెచ్ పి పట్నాయక్, తదితర యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - విజయనగరం, కంటోన్మెంట్ : వచ్చేనెల 13వ తేదీన న జరగబోయే జాతీయ లోక్ అదాలత్ ను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత తెలిపారు. నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ బజాజ్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ, శ్రీరామ్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ మేనేజర్లతో, ఇన్సూరెన్స్ కంపెనీ న్యాయ వాదులతో ప్రీ సిట్టింగ్ లోక్ అదాలత్‌ను నిర్వహించారు. ఈ ప్రీ సిట్టింగ్ లోక్ అదాలత్ లో 12 ప్రమాద బీమా క్లైమ్ కేసులను రాజీకి వచ్చినట్లు తెలిపారు , ప్రమాద బీమా క్లెయిమ్ కేసు లు అన్ని సివిల్ దావాలు ప్రీ సిట్టింగ్ లోకదాలాత్‌లో పరిష్కరించుటకు ప్రీ సిట్టింగ్‌లోక్ అదాలత్ లను ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమంలో ఫ్యామిలీ కోట్ జడ్జ్ కె.విజయ కళ్యాణి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి ఏ.కృష్ణ ప్రసాద్, ఇన్సూరెన్స్ కంపెనీ అధికారులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ

విశాలాంధ్ర - దత్తిరాజేరు : ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కోరపు కొత్తవలస డాక్టర్ కె.రఘు వైద్యాధికారి ఆధ్వర్యంలో మంగళవారం మరడాం జిల్లా పరిషత్ పాఠశాలలో 1 నుండి 19 వయస్సు గల పిల్లలం దరికీ నులుపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ జరిగిందని అన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ 2416 మందికి పిల్లలు కాగా 90 శాతం మాత్రలు పంపిణీ చేయడం జరిగిందని అన్ని అంగన్వాడి సెంటర్లో, హై స్కూల్ మరియు కాలేజ్ విద్యార్థులు అందరికీ మధ్యాహ్నం భోజనం తర్వాత మాత్రలు మింగించడం జరిగిందని అన్నారు. ఆరోగ్యం ద్వారా విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రత, త్రాగునీరు తీసుకోవడం మరియు ఆకుకూరలు కాయగూరలు మంచినీటితో కడగడం ద్వారా వంటి చర్యలు ద్వారా నులుపురుగులను నివారించవచ్చని అన్నారు ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రెడ్డి మహేశ్వరరావు, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ డివి గిరిబాబు, ఎంపిహెచ్ఓ, బి.మురళి, వైద్య సిబ్బంది, మరియు సచివాలయం పాల్గొన్నారు.

ఎన్నికల హామీలపై కూటమి ప్రభుత్వం, చంద్రబాబును నిలదీయండి

విశాలాంధ్ర - బొబ్బిలి : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ లు ఎన్నికల హామీల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో తీవ్రంగా విఫలం చెందిందని కూటమి ప్రభుత్వం మేనిఫెస్టో ను గుర్తుకు తెస్తూ రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్ర మంలో భాగంగా మంగళవారం పురపాలక సంఘం పరిధిలో గల 27వ వార్డులో మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు పట్టణ వైసీపీ నాయకులతో కలిసి చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుకు చేస్తూ ఇంటింటికి తిరుగుతూ ప్రజలకు గుర్తుకు చేస్తూ చంద్ర బాబు చేసిన మోసాలను ప్రజలకు వివరించి రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని మాజీ ఎమ్మెల్యే శంబంగి వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణరావు, వార్డు ఇంచార్జ్ సుంకరపల్లి వాసంతి, మాజీ బుడా చైర్మన్ ఇంటి గోపాలరావు, నియోజకవర్గ యువజన అధ్యక్షుడు బేతనపల్లి శంకరరావు, వివిధ వార్డు ఇంచార్జ్‌లు, వైసీపీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేసి పైప్ లైన్ వేయండి...

విశాలాంధ్ర - కొత్తవలస : హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ కంపెనీ యాజమాన్యం విశాఖపట్నం నుంచి రాయపూర్ వరకూ నిర్మించదలచిన పైప్లైన్ ఏర్పాటులో భాగంగా భూసేకరణ కొరకు కొత్తవలస మండలంలోని గులివిందాడ, చీడివలస, సుంద రయ్యపేట, సంతపాలెం గ్రామాల రైతులతో ప్రభుత్వం మంగళవారం బహిరంగ విచారణ కార్య క్రమాన్ని నిర్వహించారు. కొత్తవలస మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్(భూసేకరణ) ఎస్.సుధాసాగర్, హెచ్.పి.సి.ఎల్ చీఫ్ మేనేజర్ జి.కిషోర్, విశ్రాంత తహసీల్దార్ జి.అప్పల నాయుడు పాల్గొన్నారు. ముందుగా ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్(భూసేకరణ) ఎస్.సుధాసాగర్ మాట్లాడుతూ విశాఖపట్నం నుంచి రాయపూర్ వరకూ భూగర్భ పైప్లైన్ ను హెచ్.పి.సి.ఎల్ - వి.ఆర్.పి.ఎల్ ప్రాజెక్టు వారు వేయనున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో 4 జిల్లాల్లో సుమారు 30మండలాల్లోని 113 గ్రామాల్లో 164కిలో మీటర్లు ద్వారా ఈ పైప్లైన్ వెళుతుందని, ఇతర రాష్ట్రలను కలుపుకుని ఏర్పాటయ్యే ఈ పైప్లైన్ ద్వారా కంపెని వారు గ్యాస్, పెట్రోల్, డీజిల్ వంటివి రవాణా అవుతాయని స్పష్టం చేశారు. 12మీటర్ల వెడల్పుతో భూమి వినియోగహక్కు రైతుల నుంచి తీసుకుని అందులో 14ఇంచీల వెడల్పు గల స్టీల్ పైప్ ను ఏడున్నర అడుగుల లోతులో వేయనున్నట్లు వివరించారు. పెట్రోలియం అండ్ మినరల్స్ పైప్లైన్ చట్టం 1962 ప్రకారం ప్రభుత్వ ఈ ప్రాజెక్ట్ ఏర్పాటుకు చర్యలు చేపట్టిందని రైతులు సహకరించాలని ఆయన కోరారు. కొత్తవలస మండల పరిధిలో పైప్లైన్ వెళ్తున్న ఆయా గ్రామాల రైతులు సభలో వారి..వారి అభ్యంతరాలు, అభిప్రాయాలను తెలియజేశారు. గులివిందాడ, సంతపాలెం, సుందరయ్యపేట గ్రామాల రైతులతో పాటూ సిపిఐ డివిజన్ కమిటీ నాయకులు దేగల అప్పలరాజు సభలో ఆవేదన తెలియజేశారు. ఇప్పటికే ఈ గ్రామాల మీదుగా 130సిడి గ్రీన్ ఫీల్డ్ హైవే, ఐఓసిఎల్ పైప్లైన్, పోలవరం కాలువ వంటి అభివృద్ధి పనులకు ప్రభుత్వం భూమి తీసుకుందని గుర్తుచేశారు. మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందాన మళ్ళీ మరో పైప్లైన్ అంటూ ఉన్న కాస్తంతా భూమిని రైతుల నుంచి బలవంతంగా లాక్కోవడం సమంజసం కాదని ఆవేదన వ్యక్తం చేశారు. వందలెళ్ళుగా ఈ భూముల్లో సాగుచేసుకుని జీవనోపాధి పొందుతున్న చిన్న, సన్నకారు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, రోడ్డున పడే పరిస్థితి ఎదురైందని అధికారుల ముందు మొరపెట్టు కున్నారు. ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్(భూసేకరణ) ఎస్.సుధాసాగర్ స్పందిస్తూ రైతులు తెలిపిన ప్రతీ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామ్మన్నారు. ప్రభుత్వ నిభంధనలు, ఆదేశాల మేరకు తదుపరి చర్యలు చేపడతామని, రైతుల పూర్తి సమ్మతితోనే పైప్లైన్ పనులు ప్రారంభమవుతాయని స్పష్టం చేశారు.

హర్ ఘర్ తిరంగ వేడుకలు

విశాలాంధ్ర - రాజాం : రాజాం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఐకెపి ఆధ్వ ర్యంలో 'హర్ ఘర్ తిరంగ' కార్యక్రమం జరిగింది. ఎంపిడిఓ వావిలపల్లి.శ్రీనివాసరావు ఆధ్వ ర్యంలో జరిగిన కార్యక్రమంలో మహిళా సమా ఖ్య సభ్యులు పాల్గొన్నారు. ప్రతీ ఇంటా త్రివర్ణ పతాకం ఎగరాలి అని నినాదాలిచ్చారు.

కొత్తవలస : భారత స్వాతంత్ర్య దినోత్సవ ఉత్సవాల్లో భాగంగా 05.08.2025 నుండి 15.08.2025 వరకు ప్రధానమంత్రి హర్ ఘర్ తిరంగా ఉత్సవాన్ని వెలుగు సిబ్బంది ఆధ్వర్యంలో మంగళవారం కొత్తవలస ఎంపిడిఓ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున మహిళలు ర్యాలీ లో పాల్గొని మూడు రంగులతో ముగ్గులు, కాయకురాలు, స్వీట్స్, మిల్లెట్స్, బట్టలతో స్టాల్స్ ఏర్పాటు చేశారు.

ప్రజలను మోసం చేయడం చంద్రబాబుకు కొత్త కాదు

మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : ప్రజలను మోసం చేయడం కూటమి ముఖ్యమంత్రి చంద్రబాబుకుకొత్త కాదని మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 41వ డివిజన్ కార్పొే ంటర్ సుంకర నారాయణస్వామి అధ్యక్షతన మంగళవారం జరిగినబాబు షూరిటీ - మోసం గారంటీ కార్య క్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోలగట్ల వీరభద్ర స్వామి మాట్లాడుతూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి సూచనలతో వార్డు పర్యటనలు నిర్వహించి ఏడాది కాల కూటమి ప్రభుత్వ పనితీరును, అమలు చెయ్యని పథకాలను కరపత్రాల ద్వారా ప్రజలకు వివరించడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం ప్రజలు పడుతున్న సమస్యలపై అధికారుల వద్ద ప్రశ్నించాలన్నారు. గతంలో ఎన్నోసార్లు ప్రజలకు మోసం చేసి అధికారం వచ్చిన తర్వాత ప్రజలను చంద్రబాబు పట్టించుకోలేదన్నారు. ప్రస్తుతం ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. ఎన్నో సంక్షేమ పథకాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చిన ఘనత కేవలం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఎస్ వి వి రాజేష్, వైకాపా మాజీ మున్సిపల్ కార్పొరేటర్ ఆవనాపు లక్ష్మణరావు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సంఘం రెడ్డి బంగారు నాయుడు, వైసిపి నగర ఉపాధ్యక్షులు రెడ్డి గురుమూర్తి, మైనారిటీ సభ్యులు ఎం.డి మున్వర్, కో- ఆప్షన్ సభ్యులు రహీమ్ , మాజీ కార్పొరేటర్ మతీమ్, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు, మహిళలు పాల్గొన్నారు.

కల్వర్టు పనులు ప్రారంభం..విశాలాంధ్ర వార్తకు స్పందన

విశాలాంధ్ర - రాజాం : ప్రమాదకరంగా ఉన్న పట్టించుకోని అధికారులు..... ప్రజల ప్రాణాలు పై ఇంత నిర్లక్ష్యమా.....! అనే శీర్షిక విశాలాంధ్ర దినపత్రిక సోమవారం ప్రచురించిన కథనానికి ఆర్ అండ్ బి అధికారులు స్పందించి మంగళవారం కల్వర్టు మరమ్మత్తు పనులు చేపట్టారు. రాకపోకలకు అంతరాయం కలగకుండా ఈ కల్వర్టు పక్కనే వాహనాలకు దారి ఏర్పాటు చేశారు. ఈ పనులు చేపట్టిన విషయమై విశాలాంధ్ర ప్రతినిధి ఆర్ అండ్ బి ఏఇ నాగభూషణం ని వివరణ కోరగా గాయత్రీ కాలనీ వద్ద ఈ కల్వర్టు, జందాల దిబ్బ, ఇప్పిలిపేట మధ్య ఉన్న కల్వర్టు, మజ్జిరాయుడుపేట వద్ద ఉన్న కల్వర్టు మొత్తం ఈ మూడింటికీ కలిపి గతంలో సుమారు 13 లక్షల 50 వేల వరకు ప్రభుత్వం ఈ కల్వర్టులు నూతన నిర్మాణం కొరకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. అయినప్పటికీ అంతకుముందు పెండింగ్లో ఉన్న బిల్లులు విడుదల కాకపోవడం వలన ఈ కల్వర్టులు నిర్మాణం చేపట్టేందుకు కాంట్రాక్టర్ ముందుకు రానందువలన ఈ నిర్మాణ పనులు ఆగిపోయాయి. అయితే గాయత్రి కాలనీ వద్ద ఉన్న కల్వర్టు పూర్తిగా పాడైపోవడం వలన రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతున్నందువలన కాంట్రాక్టర్ తో మాట్లాడి ఈ కల్వర్టు నిర్మాణ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకున్నామని ఏఈ నాగభూషణం తెలిపారు. ఎట్టికేలకు అధికారుల స్పందించి ఈ కల్వర్టు వద్ద ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు తీసుకునీ, కల్వర్టు నిర్మాణం చేస్తున్నందుకు పలువురు హర్షం వ్యక్తపరిచారు.

సముద్రపు ఉత్పత్తుల ప్రాసెస్ పై జిల్లా స్థాయి కమిటీ

జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్ అంబేద్కర్

విశాలాంధ్ర - విజయనగరం : బాల కార్మిక చట్టాన్ని అనుసరించి సముద్రపు ఉత్పత్తులకు సంబంధించి ప్రాసెస్సింగ్ ప్లాంట్స్ వద్ద, హేచరీ లలో, కోల్డ్ స్టోరేజ్ లలో పనిచేస్తున్న కార్మికుల సంక్షేమానికి, బాల కార్మికుల నిరోధానికి జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీ ని నియమించినట్లు జిల్లా కలెక్టర్ బి.ఆర్ అంబేద్కర్ తెలిపారు. మంగళవారం ఆయన ఛాంబర్లో కమిటీ సభ్యుల తో సమావేశం ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ చైర్మన్ గానూ, కార్మిక శాఖ డిప్యూటీ కమీషనర్ నోడల్ అధికారిగాను, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ , మత్స్య శాఖ డి డి , కాలుష్య నియంత్రణ మండలి ఈ ఈ లు సభ్యులుగా ఈ కమిటీ నియమించడం జరిగిందని తెలిపారు. కమిటీ సభ్యులు ఒకే రోజున సంయుక్తంగా జిల్లాలో నున్న 13 హేచరీ లను తనిఖీ చేసి నివేదిక రూపొందించి ప్రభుత్వానికి పంపాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో కార్మిక శాఖ డిప్యూటీ కమీషనర్ ప్రసాద్, పి సి బి ఈ ఈ సరిత, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ కరుణాకర్, నత్స్య శాఖ డి డి విజయ్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు అందజేసిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - భోగాపురం : నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.45,700 చెక్కును గాబువానిపేట, ముం జేరు గ్రామానికి చెందిన నల్ల తాతయ్యలుకు సోమవారం అందజేశారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ ఆర్థిక సహాయం ఎనలేదని, భవిష్యత్తులో కూడా ఇలాం టి సహాయ పథకాలతో ప్రజల భారం తగ్గించేందుకు తాము కృషి చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

విజేత కోచింగ్ విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర - రాజాం : రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ 2025 ఫలితాలలో రాజాం విజేత కోచింగ్ సెంటర్ విద్యార్థులు అత్యధికంగా విజయం సాధించారు. కె.జ్యోతి ఎస్జిటి విభాగంలో 93.96 మార్కులు సాధించారు. డి.శిరీష 92.39, కె.స్వప్న 91.38, ఏవి ప్రకాష్ 91.21, వై భాగ్యలక్ష్మి 90.73, సిహెచ్.సత్యవతి 90.52, డి.శ్రావణి 90. 21, రికార్డు స్థాయిలో మార్కులు సాధించారు. ఎస్.ఏ సోషల్ విభాగంలోకె. శిరీష 89.55 మార్కులుతో స్టేట్ సెకండ్ రికార్డు సాధించారు. ఎస్ఏ బయాలజీ విభాగంలో గరుగుబిల్లి. రాంబాబు 88.57 మార్కులతో స్టేట్ తరుణ్ ర్యాంక్ సాధించారు. విజేత కోచింగ్ సెంటర్ లో సుమారు 500 మంది ఉపాధ్యాయ కోచింగ్ తీసుకోగా సుమారు 200 మంది ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపిక య్యారని కోచింగ్ సెంటర్ డైరెక్టర్ బి.శ్రీదేవి,మాస్టర్ అప్పలరాజు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు అధ్యాపక బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.

పుష్పాలంకరణలో పైడితల్లి అమ్మవారు

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : శ్రావణ మంగళవారం సందర్భంగా ఉత్తరాంధ్ర ఇలవేల్పు శ్రీ పైడితల్లమ్మ వారు పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణం అంతా ప్రత్యేక అలంకరణ చేశారు. పైడితల్లమ్మ వారికి ఉదయాన్నే పంచామృత అభిషేకాన్ని ఆలయ ఈవో కె శిరీష ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం అమ్మవారికి పుష్పాలంకరణ చేశారు. శ్రావణమాసం సందర్భంగా సుదూర ప్రాంతాల నుండి భక్తులు ఉదయం నుండే చదురు, వనం దేవాలయాల వద్దకు విచ్చేసి తమ మొక్కుబడులు చెల్లించుకున్నారు. దేవాలయం వద్దకు విచ్చేసిన భక్తులకు ఆలయ అర్చకులు ఏడిద వెంకటరమణ, పూజారి బంటుపల్లి వెంకటరావు, ధనుంజయ్ పూజలు నిర్వహించారు. దేవస్థానంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ సూపరింటెంట్ వైవి రమణి, సీనియర్ అసిస్టెంట్ ఏడుకొండలు, జూనియర్ అసిస్టెంట్ రమేష్ పట్నాయక్ చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, పైడితల్లి అమ్మవారిదేవస్థానం ఈవో కె శిరీష మాట్లాడుతూ శ్రావణమాసం సందర్భంగా ప్రతి మంగళవారం ఉదయం పంచామృతాభిషేకం ఉదయం నాలుగు గంటలకు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి శ్రావణ శుక్రవారం రోజు విశిష్ట కుంకుమార్చనలు ,ప్రతిరోజు కుంకుమార్చన, శ్రీచక్రార్చన పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. వీటితోపాటు శ్రావణ పౌర్ణమి రోజున, స్వర్ణ పుష్పార్చన జరుగుతుందన్నారు. పూజలకు హాజరైన భక్తులు సాంప్రదాయ వస్త్రాలతో రావాలన్నారు. భక్తుల సౌకర్యార్థం చదరు, వనం దేవాలయాల వద్ద ప్రతిరోజు భక్తులకు ఉచిత ప్రసాదం, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. కావున భక్తులంతా శ్రీ పైడితల్లమ్మ వారి దేవస్థానంలో జరిగే శ్రావణ మాస పూజలకు భక్తులు హాజరవ్వాలని కోరుతున్నామన్నారు. దేవస్థానం వద్ద క్వీన్స్ ఎన్ఆర్ఐ ఆసుపత్రి సిబ్బంది ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.

సీతం కళాశాలలో మేనేజ్మెంట్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో వర్క్ షాప్

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : సత్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ (సీతం) లో మేనేజ్మెంట్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో క్రాస్ కల్చరల్ కమ్యూనికేషన్ బిజినెస్ ప్యాటర్న్స్ ఇన్ జపాన్ అనే అంశంపై ప్రత్యేక వర్క్‌షాప్‌కళాశాల ప్రాంగణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రామ్ టేజ్ టెక్నాలజీస్, హిరోషిమా, జపాన్ టెక్నికల్ డైరెక్టర్, శాస్త్రవేత్త, పరిశ్రమాధిపతి డా. ఎస్. సన్యాసి రావు హాజరయ్యారు. ఆయన జపాన్‌లోని వ్యాపార విధానాలు, సాంస్కృతిక భేదాలు, వ్యాపార సంబంధాలలో ఆచరణీయ పద్ధతులు, పరస్పర అవగాహన ప్రాధాన్యతపై వివరించారు అంతర్జాతీయ వ్యాపార సంబంధాలలో సాంస్కృతిక అవగాహన ఎంత ముఖ్యమో ప్రాక్టికల్ ఉదాహరణలతో తెలిపారు. కళాశాల డైరెక్టర్ మజ్జి శశి భూషణరావు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా వ్యాపారంలో విజయవంతం కావాలంటే క్రమశిక్షణ, కృషి, సాంస్కృతిక అవగాహన ముఖ్యమన్నారు మేనేజ్మెంట్ స్టడీస్ విభాగాధిపతి డా. ఎస్. వరూధిని మాట్లాడుతూ ఈ కార్యక్రమం విద్యా ర్థులలో అంతర్జాతీయ వ్యాపార అవగాహన పెంపొందించడంలో ఎంతగానో దోహదం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజ్యాంగంపై అవగాహన అవసరం

విశాలాంధ్ర - విజయనగరం ఫోర్ట్ : భారత రాజ్యాంగం పట్ల అవగాహన అవసరమని జనవిజ్ఞాన వేదిక జిల్లా కమిటీ సభ్యులు, ఇన్స్పైడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు గొర్లె చిన్నం నాయుడు తెలిపారు. ఇంటర్నేషనల్ యూత్ డే సందర్భంగా మంగళవారం విజయనగరం కేంద్రీయ విద్యాల యంలో విద్యార్థులకు రాజ్యాంగం-ప్రాధాన్యత అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగానికి ప్రపంచంలో ప్రత్యేకమైన గుర్తింపు ఉందని పేర్కొన్నారు. భారత రాజ్యాంగం విధులు, విధానాల పట్ల విద్యార్థులకు అవగాహన అవసరమని స్పష్టం చేశారు.

ప్రతి ఒక్కరూ దేశభక్తి కలిగి ఉండాలి : వైసీపీ జిల్లా ప్రచార అధ్యక్షులు వలిరెడ్డి

విశాలాంధ్ర - చీపురుపల్లి : ప్రతి ఒక్కరూ దేశభక్తిని కలిగి ఉండాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు వలిరెడ్డి శ్రీనివాస నాయుడు అన్నారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమము లో భాగంగా మంగళవారం నాడు చీపురుపల్లి వెలుగు మండల మహిళా సమాఖ్య డి. ఆర్. డి. ఏ. ఏపిఎం అప్పలనాయుడు ఆధ్వర్యంలో చీపురుపల్లి మండల పరిషత్ కార్యాలయం ఆవర్ణ లో హర్ ఘర్ తిరంగా ప్రచారంలో ఆయన పాలొ న్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఆగస్టు 13 నుండి 15 వరకు ప్రజలు తమ ఇళ్లలో జాతీయ జెండాను ఎగురవేయాలని కోరుతూ జాతీయ సమైక్యతను చాటి చెప్పాలని కోరారు. హర్ ఘర్ తిరంగా" అనేది భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో భాగంగా, ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయడానికి ప్రజలను ప్రోత్సహించే ఒక ప్రచారం చేయాలన్నారు. ఈ ప్రచారం ద్వారా జాతీయ జెండాతో ప్రజలకు మరింత వ్యక్తిగత సంబంధం ఏర్పడేలా చేయాలని భావిస్తున్నారు. అని అన్నారు. హర్ ఘర్ తిరంగా అనేది ప్రజలు తమ ఇళ్లలో జాతీయ జెండాను ఎగురవేయడం ద్వారా దేశభక్తిని చాటుకోవడానికి మరియు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొనడానికి ఒక అవకాశం అన్నారు. జాతీయ జెండాతో ప్రజల అనుబంధాన్ని బలోపేతం చేయడం మరియు దేశం పట్ల వారిలో మరింత ప్రేమ, గౌరవం పెంచడం జరుగుతుంది అన్నారు. జెండా అనేది కేవలం ఒక చిహ్నంగా కాకుండా, ప్రతి భారతీయుడి వ్యక్తిగత భావోద్వేగాలకు, దేశభక్తికి ప్రతీకగా మారుతుంది. అన్నారు. ప్రజలు తమ ఇళ్లలో జెండాను ఎగురవేసి, దానితో సెల్ఫీలు దిగి, అధికారిక వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయడం ద్వారా ఈ ప్రచారంలో పాల్గొనవచ్చు అన్నారు. హర్ ఘర్ తిరంగా ప్రచారంలో భాగంగా, ప్రతి సంవత్సరం ఆగస్టు 13 నుండి 15 వరకు ప్రజలు తమ ఇళ్లలో జాతీయ జెండాను ఎగురవేయాలని కోరరు. అంతరం కార్యాలయం ఆవర్ణలో డ్వాక్రా మహిళా లు తయారు చేసిన వివిధ పిండి వంటలు, పెరడు పంట కూరగాయలు స్టాల్‌ను ఏపిఎం అప్పల నాయుడు తో కలిసి పరిశీలించారు ఈ కార్యక్రమంలో, తమ్మిన కృష్ణ, కర్రోతు ప్రసాద్, గవిడి కల్కి జీవన్, కంచుపల్లి అశోక్, డి.రాములు, ప్రభాత్ కుమార్, బుంగ సంతు, వెంకీ, కిషోర్, ఏపీఎం అప్పలనాయుడు, సీసీలు గోవిందా, నారాయణమ్మ, సూర్యనారాయణ, మహిళా సమాఖ్య అధ్యక్షులు, వివో ఏలు, వెలుగు సిబ్బంది, మహిళా లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.